క్లుప్తంగా...

సత్కారం



కె.ఎస్.ఆనంద్ రావును సన్మానిస్తున్న మోహన్, శ్యాంరావు ముదిరాజ్ తదితరులు

చార్మినార్: మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ మహంకాళి ఆలయం గౌలిపురా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైన కె.ఎస్.ఆనంద్ రావును పలువురు ఘనంగా సత్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయనకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు కాశమ్యోని శ్యాంరావు ముదిరాజ్, సి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో హరితహారం



హరితహారంలో డాక్టర్ ఉషారాణి, చిత్రంలో జ్యోతి

నాంపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రి ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆసుపత్రిలో సుమారు 15 మొక్కలు నాటి నీటిని పోశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ జ్యోతితో పాటుగా ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోషామహల్ అభివృద్ధికి నిరంతరం కృషి



గోషామహల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ

అబిడ్స్: గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. గోషామహల్‌లో జన్ సంపర్క్ అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా తాను నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోల్కొండ కోటకు మంత్రి తలసాని

గోల్కొండ: నేడు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గోల్కొండ కోటకు రానున్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గోల్కండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల బోనాల జాతర ఉత్సవాల ఏర్పాట్లపై జరిగే సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో బోనాల ఏర్పాట్లపై ఆయన మాట్లాడుతారు.

సోమవారం నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంల పరిశీలన సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో భాగంగా ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లను పరిశీలించనున్నారు. రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఈవీఎం గోదాముల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ ఈవీఎంల గోదాములు గతంలో నిర్మించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన నియోజకవర్గాల ఈవీఎంలో ఇందులో భద్రపరిచారు.

జోరుగా చేప ప్రసాదం పంపిణీ

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాద పంపిణీ శుక్రవారం మొదటిరోజు జోరుగా కొనసాగింది. పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వానికి తోడుగా పలు స్వచ్ఛంద సంస్థలు భోజనాలు, అల్పాహారాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేసి కంట్రోల్‌రూమ్ ద్వారా ప్రజలకు సేవలందించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్వినిమార్గం, వినయ్‌కుమార్‌ముదిరాజ్, గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఉద్యమ నేతలు ఆర్‌వీ మహేందర్, ఆర్.శంకర్‌లాల్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థలు తమ సహకారాన్ని అందించాయి.





చేప ప్రసాదం పంపిణీకి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు



అల్పాహార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్



చేప ప్రసాద పంపిణీకి చేయూతనందించిన గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు



ప్రధాన కేంద్రంలో చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న మల్లికార్జున్ గౌడ్, రాజేష్‌గౌడ్

దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో..

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని బత్తిని సోదరులు పంపిణీ చేసే చేప ప్రసాదం శుక్రవారం ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమాల అనంతరం ఆస్తమా రోగులకు పంపిణీ చేశారు. ఎగ్జిబిషన్ మైదానంలో పెద్ద ఎత్తున పంపిణీ చేసినప్పటికీ.. దూద్‌బౌలిలోని తన నివాసంలో సైతం రోగులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముంబై, అస్సోం, ఢిల్లీ, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు బత్తిని శంకర్‌గౌడ్, కుటుంబ సభ్యులు చేస ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేప ప్రసాదాన్ని శనివారం సాయంత్రం వరకు కొనసాగిస్తామని.. తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి చేస ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. కామాటిపురా పోలీసులు రోగులకు ఇబ్బందులు కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షించారు.



బత్తిని నివాసంలో చేప ప్రసాదం పంపిణీ



వీఐపీ కేంద్రంలో చేపప్రసాదం పంపిణీ చేస్తున్న నాంపల్లి బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మెట్టు వెంకటేష్



అల్పాహారాలు, భోజనాలు పంపిణీ చేసిన బద్రి విశాల్ పన్నాలాల్ ప్రీతి ట్రస్ట్ సభ్యులు





చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్ సతీష్



బోనాలకు పటిష్ట బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల జాతర ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన తన సిబ్బంది, మైత్రి కమిటీ సభ్యులతో కలిసి గోల్కొండ కోటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కోటలో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు కోసం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవార్ల దర్శనం కోసం భారీ క్యూలు ఉంటాయని, అయితే తొక్కిసలాంట జరగకుండా అడుగడుగున పోలీసులను నియమిస్తామని ఆయన అన్నారు. భక్తులు ప్రసాదం తయారు చేసుకునే ప్రాంతాలలో సైతం పోలీసులను నియమిస్తామన్నారు. లంగర్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే తొట్టెల ఊరేగింపులో భారీ ఎత్తున పోలీసు బలగాలను నియమించి ఊరేగింపులో ఎటువంటి అపశృతి దొర్లకుండా చర్యలు తీసుకుంటామని, దీని కోసం స్థానిక యువకులు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలను వినియోగించుకుంటామని ఆయన అన్నారు. అనంతరం గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి వృత్తిపనివార్ల సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్సైలను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇలియాస్ అక్బర్, షాన్నవాజ్ ఖాన్, బి. శ్రీకాంత్ చారి తదితరులున్నారు.

కొనసాగుతున్న మహంకాళి బోనాల వజ్రోత్సవాలు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయ 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 45వ రోజును పురస్కరించుకొని ఆలయ కమిటీ కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.పి క్రాంతికుమార్ దంపతులచే అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సతీష్‌కుమార్, కృష్ణ, వినోద్, జగ్‌మోహన్, శేఖర్‌యాదవ్, సాయినాథ్, రజాత్ పాల్గొన్నారు.



చండీ హోమం నిర్వహిస్తున్న క్రాంతికుమార్ దంపతులు

షాదీ ముబారక్ దేశంలోనే గొప్ప పథకం

చార్మినార్: తెలంగాణలో అమలవుతున్న షాదీ ముబారక్ దేశంలోనే గొప్ప పథకమని..మైనార్టీ వర్గాల ప్రజల్లో ఈ పథకం కొత్త వెలుగులు నింపుతుందని సిటీ కళాశాల విద్యార్థి జామి ఉమేర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న జామి ఉమేర్ షాదీ ముబారక్ పథకం ప్రయోజనాలను గురించి వ్యాసం రాశాడు. దివ్యాంగుడైన జామి ఉమేర్‌కు రెండు చేతులు లేకపోయినప్పటికీ కాలి సహాయంతోనే వ్యాసరచన పోటీల్లో పాల్గొని షాదీ ముబారక్ పథకం తీరు తెన్నులను సమూచితంగా విశ్లేషించాడు. కాలితోనే కలం పట్టుకొని వ్యాసం రాసిన జామి ఉమేర్ కమనీయ సంకల్పాన్ని చూసి కళాశాల ఆచార్యులు, విద్యార్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా జామి ఉమేర్ మాట్లాడుతూ... షాదీ ముబారక్ పథకం పేదరికంలో మగ్గుతున్న ముస్లిం ప్రజలకు ఆత్మగౌరవాన్ని కలిగిస్తుందన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం ప్రభుత్వ సిటీ కళాశాల సాంస్కృతిక విభాగం నిర్వహించిన వివిధ సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని నవ వసంతాల తెలంగాణ రాష్ట్ర ప్రగతి తీరుతెన్నులను చర్చించారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చి జూన్ 3వ తేదీ నుంచి తొమ్మిదవ తేదీ వరకు జరిగిన ఉపన్యాస, వ్యాసరచన, నృత్యం, పాటలు, చిత్రకళా పోటీల్లో విద్యార్థులు అసమాన ప్రతిభాపాటవాలను ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో జరిగిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విజయశ్రీ, ప్రతీక్ష, ఉమేర తబస్సుమ్, మల్లికార్జున్ రెడ్డి తదితర విద్యార్థులు రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మీ, దళితబంధు, మిషన్ కాకతీయ వంటి పథకాలను విశ్లేషిస్తూ చర్చించడంతో పాటు తమ వ్యాసాల్లో ఆయా పథకాల ప్రయోజనాలను వివరించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సాంస్కృతిక విభాగాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ అభినందించారు.



మాట్లాడుతున్న సిటీ కళాశాల విద్యార్థులు

నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్



గౌలిపురా: రానున్న ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని గౌలిపురా డివిజన్ సీఐబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆదర్ల మహేశ్, ప్రధాన కార్యదర్శిగా జీపీ సురేశ్ కుమార్, కోశాధికారిగా బ్రహ్మానందం, ఉపాధ్యక్షులుగా డి.యాదగిరి, పి.ఇమాన్యుయల్, పి.రాంమూర్తి, కె.దేవేందర్, ఎం.కుమార్, జి.ఎం.జ్యోతికుమార్, కె.ప్రభాకర్, కె.సురేందర్, ఎస్.చంద్రశేఖర్, జె.చిరంజీవి, కార్యదర్శులుగా ఎ.దయానంద్, జి.బాబు రావు, సి.చంద్రమోహన్, ఎ.ప్రభుదాస్, ఎల్.రాకేశ్వర్ రావు, కె.దేవేందర్, ఎం.రామానంద్, ఎ.రాజ్ కుమార్, ఎ.పార్థసారథి, ఎల్.రమేశ్, పబ్లిక్ సిటీ కార్యదర్శులుగా ఎ.అమృత్ కుమార్, పి.సుధీర్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎ.అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆదర్ల మహేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి



అంబటి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఎంబ వినోద్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ శివబాగ్‌లోని తన కార్యాలయంలో ఆయన పలువురు పద్మశాలి నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘటితంగా తమ హక్కుల సాధనకు పద్మశాలీలు పోరాడుతున్నారన్నారు. పద్మశాలి కులస్తులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, చెన్న నరేందర్‌దేవ్ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జితేందర్, రఘునాథ్, మధు, యజ్ఞదేవ్, యాదగిరి తదితరులున్నారు.

ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకం

గోల్కొండ: ప్రయాణికులకు అన్ని రకాల సేవలు అందించి వారి మన్ననలు పొందడమే వారి లక్ష్యమని ఆర్టీసీ మెహిదీపట్నం జోన్ డిప్యూటీ మేనేజర్ ఉదయ భాను అన్నారు. ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడానికి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ సూచనలతో ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత కాలంగా ప్రయాణికుల సలహాలు, సూచనలు పాటిస్తూ వారు కోరిన రూట్లలో బస్సులను వేస్తున్నామని ఆయన అన్నారు. సరికొత్త పథకాలతో ప్రజలకు మరింత చేరువగా ఉండటమే సంస్థ లక్ష్యమని ఆయన అన్నారు. దీనికి సంస్థ సిబ్బంది సైతం మరింత అంకితమైన సేవా భావంతో నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం 30 విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని ఆయన అన్నారు. వీరు ఆర్టీసీ సేవల గురించి గ్రామస్తులకు తెలియజేస్తారని, వారి సలహాలు సూచనలు ఉన్నతాధికారులకు తెలియజేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ మండలం ఆర్టీఓ సీపీవీ రావు, మెహిదీపట్నం డిపో మేనేజర్ సూర్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ తదితరులున్నారు.



మెహిదీపట్నం డిపోలో సమావేశం

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

యాకుత్‌పురా: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించనున్న జాతీయా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకా యారా సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్ కోర్టుల్లో పలు ప్రత్యేక బెంచిలను ఏర్పాటు చేస్తున్నారమన్నారు. నిజమైన కక్షిదారుల సమక్షంలో కుటుంబ తగదాలు, భూ సంబంధిత, బ్యాంకు రుణ లావాదేవిలు, మోటారు వాహన ప్రమాదాలు, తదితర సివిల్ కేసులను ఇరు పక్షల కక్షిదారుల అంగీకారంతో పరిష్కారిస్తామని ఆమె తెలిపారు. కేసులను పరిష్కారించుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యలయంలో సంప్రదించాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇరు పక్షలకు చెందిన అంగీకారంతో కేసులను సత్వరమే పరిష్కారిచబడుతుందన్నారు.


12న అప్రెంటిషిప్ జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: ఈనెల 12న అప్రెంటిషిప్ మేళా, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శాంతినగర్ ఐటీఐ ప్రిన్సిపల్ పసుపులేటి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బిటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వివిధ పరిశ్రమల్లో అప్రెంటిషిప్ శిక్షణను ఇచ్చేందుకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు https://www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో తమ బయోడేటాను నమోదు చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు హాజరు అయ్యే అభ్యర్థులు ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు విజయనగర్‌కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ శాంతినగర్‌లో సంప్రదించవచ్చన్నారు.

22 నుంచి గోల్కొండ కోట బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు జూన్ 22 నుంచి ప్రారంభం కానున్నాయని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. జూన్ 22వ తేదీ గురువారం నుంచి ఆషాఢమాస బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. జూన్ 25న ఆదివారం 2వ పూజ, జూన్ 29న గురువారం 3వ పూజ ఉంటాయన్నారు. జూలై 2న ఆదివారం 4వ పూజ, 5వ పూజ గురువారం జూలై 6న, 6వ పూజ జూలై 9వ ఆదివారం, 7వ పూజ జూలై 13 గురువారం రోజున ఉంటాయన్నారు. 8వ పూజ జూలై 16 ఆదివారం, చివరి పూజ జూలై 20వ తేదీతో ముగుస్తాయని ఆయన అన్నారు.

వృద్ధుడి అదృశ్యం



అబ్దుల్ రషీద్

గోల్కొండ: వృద్ధుడు అదృశ్యమైన ఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గోల్కొండ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ మోతీ దర్వాజాలో నివసించే అబ్దుల్ రషీద్ (71) ప్రతిరోజూ ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 2న బయటకు వెళ్లిన అబ్దుల్ రషీద్ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆయన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అబ్దుల్ రషీద్ కూతురు జమీరా బేగం గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


కైలాష్‌కు సన్మానం



కైలాష్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ గౌలిపురా డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవేందర్ తదితరులు

గౌలిపురా: గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్మని కైలాష్ గంగపుత్రను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ గౌలిపురా డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్లంగి దేవేందర్ తదితరులు సత్కరించారు. ఆయనతో పాటు ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్ గిరి, కోశాధికారి బొడ్డు సాయిబాబా, ఎ.మహేందర్ గిరిలను సైతం సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్.దేవేందర్, డివిజన్ యూత్ నాయకులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'భారీ ఎత్తున గోల్కొండ బోనాలు నిర్వహిస్తాం'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో మైత్రి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా బోనాల ఉత్సవాలు గోల్కొండ కోట నుంచే ప్రారంభమవుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే బోనాలు విజయవంతమవుతున్నాయని ఆయన అన్నారు. బోనాల ఏర్పాట్లు, నిర్వహణలో ప్రభుత్వం అన్ని శాఖల అధికారుల సేవలను వినియోగించుకుంటుందని ఆయన అన్నారు. అంతేకాకుండా బోనాలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ బోనాల ఖర్చులకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని ఆయన అన్నారు. అన్ని రకాల పోలీస్ బలగాల సేవలు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొంటున్నాయని ఆయన అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్. రాజు మస్తాద్, గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి, ఆబెద్, షాన్నవాజ్ ఖాన్, ఇలియాజ్ అక్బర్ తదితరులున్నారు.